క్లుప్తంగా

నేడు మంగమూరు రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని మంగమూరు రోడ్డు, పరిసర ప్రాంతాల్లో ఆదివారం కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఒంగోలు నగర డీఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఒంగోలు నగర డీ–విద్యుత్ ఏఈ పరిధిలోని 11 కేవీ వీఐపీ ఫీడర్‌లోని విద్యుత్ లైన్లలో అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అందులో భాగంగా మంగమూరు డొంక రోడ్డుతో పాటు ఓల్డ్ మోడరన్ హాస్పిటల్, నిర్మల్ హైస్కూల్, ఉమామహేశ్వర కాలేజీ ఏరియాలలో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దసింగు లక్ష్మయ్యకు బాలినేని నివాళులు

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పెద్దసింగు లక్ష్మయ్యకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శనివారం నివాళులర్పించారు. ఈ నెల 19న అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. శనివారం పెద్దకర్మ సందర్భంగా బాలినేని హాజరై లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటి నుంచి తన వెంటే ఉండి అన్ని కార్యక్రమాల్లో లక్ష్మయ్య పాల్గొనేవారన్నారు. మంచి మనసున్న వ్యక్తి, అందరితో గౌరవంగా ఉండేవారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, పెద్దసింగు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ శనివారం పట్టణంలోని సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం కల్పిస్తున్న వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతులు సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, కోర్టు సిబ్బంది ఉన్నారు.

అబాకస్ పోటీ పరీక్షకు ఎంపికైన స్పందన విద్యార్థి

రాచర్ల: హైదరాబాద్‌లో ఆదివారం జరగనున్న జాతీయస్థాయి అబాకస్ పోటీ పరీక్షలకు రాచర్ల స్పందన విద్యాసంస్థల విద్యార్థి షేక్ నజీర్ బాషా ఎంపికైనట్లు ఆ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యాడని చెప్పారు. స్పందన విద్యాసంస్థల విద్యార్థులు ఇలాంటి విజయాలెన్నో సాధించాలని, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అన్నివర్గాల సంతోషమే జగనన్న లక్ష్యం



బిలాల్‌నగర్ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్



బాలినేని రోడ్ షోలో భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఇస్లాంపేటలో రోడ్ షోకు అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు, యువకులు

ఒంగోలు టౌన్: కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగించారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేద ప్రజల కోసం సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఒంగోలు నగరంలోని కేశవరాజుకుంట, బిలాల్ నగర్, రిక్షాబజార్, ఇస్లాంపేట ప్రాంతాల్లో బాలినేని రోడ్ షో నిర్వహించారు. ఆయనకు స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గజమాలతో స్వాగతం పలుకుతూ బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నింటినీ సీఎం అమలు చేశారని తెలిపారు. తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోలో సైతం అమలు చేయడానికి అవకాశం ఉన్న హామీలే పొందుపరిచారన్నారు. చంద్రబాబులా సాధ్యం కానీ హామీలు ఇవ్వడం జగన్‌కు అలవాటు లేదన్నారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని ఎద్దేవా చేశారు. రెండేళ్ల క్రితం కరోనా మహమ్మారి ప్రబలినప్పటి సంఘటనలను గుర్తు చేశారు. రెండో దశలో కరోనా వలన అనేక మంది మరణించారని, నగర ప్రజలు భయాందోళనతో గడిపారని బాలినేని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడు పలకరించడం కాదని, క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రజలకు అండగా నిలబడి ధైర్యం ఇచ్చేవాడే నాయకుడని అన్నారు. కరోనా సమయంలో ఇస్లాంపేటలో రెడ్ జోన్ పెట్టినప్పుడు హాస్పిటళ్లలో బెడ్లు కూడా దొరకలేదన్నారు. కొందరు ఆక్సిజన్ కోసం, మరికొందరు అనేక హాస్పిటళ్లలో అడ్మిషన్ల కోసం అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పారు. అలాంటి వారందరినీ తన శక్తి మేర ఆదుకున్నానని బాలినేని గుర్తుచేశారు. రిమ్స్‌లో ప్రత్యేకంగా కరోనా ఆస్పత్రి ఏర్పాటు చేయడమే కాకుండా అప్పటికప్పుడు మూడు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రజలకు అవసరమైన నిత్యావసరాలు కూడా అందించినట్లు తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్ల ప్రజలకు ఆనందయ్య మందు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కరోనా సమయంలో అడ్రస్ లేకుండా పోయిన టీడీపీ నాయకులు ఇప్పుడు మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం వస్తున్నారని చెప్పారు. వారికి గుణపాఠం చెప్పాలని కోరారు. ఇస్లాంపేటలో గతంలో చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరు రోడ్ల మీదకు చేరేదని, మురుగునీరు చేరి తిరగడానికి ఇబ్బందిగా ఉండేదని గుర్తుచేశారు. కోటి రుపాయల నిధులతో బాపూజీ కాంప్లెక్స్ నుంచి డాన్ బాస్కో వరకు డ్రైనేజీ నిర్మించామని, దాంతో ఇప్పుడు ఎంతపెద్ద వర్షం కురిసినా నీరు నిలిచే సమస్య లేదని అన్నారు. కమ్యూనిటీ హాలు అభివృద్ధికి నిధులు కేటాయించామని, ఎన్నికల తర్వాత పైఅంతస్తు నిర్మిస్తామని బాలినేని హామీ ఇచ్చారు. ముస్లింలకు ఎలాంటి సమస్య వచ్చినా జగనన్న ప్రభుత్వం అండగా నిలబడిందని, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర మేయర గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, కార్పొరేటర్లు షేక్ నూర్జహాన్, తేళ్లపల్లి ధనలక్ష్మి గాంధి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాయపాటి శ్రీను, షేక్ కాలేషా, పార్టీ జిల్లా కార్యదర్శి చాన్ బాష, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, ఖాదర్ బాషా, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి అంకయ్య, మైనారిటీ సెల్ నగర అధ్యక్షుడు మున్నా, ఆసిమ్, కరిముల్లా, బాజీ, రఫూఫ్, షేక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలినేనితోనే నగరాభివృద్ధి

- అందరివాడైన బాలినేనిని గెలిపించాలి
- 27వ డివిజన్‌లో బాలినేని శ్రీకావ్య ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శ్రీకావ్య

ఒంగోలు అర్బన్: ఒంగోలు నగరాభివృద్ధి ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితోనే సాధ్యమని, ఆరోసారి ఆయనను గెలిపించాలని ఆయన కోడలు బాలినేని శ్రీకావ్య కోరారు. స్థానిక 27వ డివిజన్‌లో జక్రయ్య హాస్పిటల్ ఎదురు రోడ్లు, కేశవస్వామిపేట, కొండమిట్ట తదితర ప్రాంతాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటేసి అందరివాడైన బాలినేని శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు బాలినేని చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు అందజేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకావ్య మాట్లాడుతూ బాలినేని మరోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ప్రతిరోజూ తాగునీరు అందించే బృహత్తరమైన పనులు జరుగుతాయన్నారు. నగరంలో 24 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేసిన వాసన్నకు అందరూ ఓటేయాలన్నారు. ఇచ్చిన ఇంటి స్థలాల్లో బాలినేని ఇళ్ల నిర్మాణాలు కూడా చేపడతారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జడా వెంకటేష్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు రెడ్డి పరమేశ్వరరావు, నాయకులు గంటా రామానాయుడు, జూటూరి శ్రీనివాసులు, శ్రీహరి, కె.రామాంజనేయులు, ప్రభాకర్, చిట్టి, మధు, సురేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీది జనరంజక మేనిఫెస్టో

- మంత్రి మేరుగు నాగార్జున



మద్దిపాడులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్యే మల్లికార్జున, నాయకులు

మద్దిపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను జనరంజకంగా తీర్చిదిద్దారని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శనివారం మద్దిపాడులో వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్యే మల్లికార్జునతో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవ అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో సామాన్య ప్రజలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. బడుగు, బలహీనవర్గాలకు ప్రయోజనం కలిగేలా మేనిఫెస్టో ఉందన్నారు. తన ఐదు సంవత్సరాల పరిపాలనలో పార్టీలకు అతీతంగా కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరేలా పథకాలను ముఖ్యమంత్రి అమలు చేశారని తెలిపారు. అటువంటి నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారా అంటూ మంత్రి ప్రశ్నించారు.

ప్రజలు తమకు జరిగిన మేలును గుర్తుంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోమారు సీఎంగా గెలిపించుకుందామని అన్నారు. అందుకోసం ప్రజలంతా వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం స్థానిక నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ నారా విజయలక్ష్మి, నాయకులు మోరబోయిన సంజీవరావు, లక్ష్మీనారాయణ, జీడ్, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, సంజీవరావు, మేకల కృష్ణారెడ్డి, ప్రసన్నాంజనేయరెడ్డి, పిట్టల ఆంజనేయులు, రాయపాటి రమేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశంలో పాల్గొన్న మంత్రి మేరుగు...

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు మండలం గురవారెడ్డి పాలెంలో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో శనివారం మంత్రి మేరుగు నాగార్జున ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాయకులు హాజరయ్యారు.

అభిమాన వేడుక..!



కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి బాలినేని శచీదేవి శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక 25వ డివిజన్‌లో రంగారాయుడు చెరువు వద్ద నుంచి ప్రారంభమైన ప్రచారం.. పోలేరమ్మ గుడి సమీపంలోకి రాగానే అక్కడేదో ఓ చిన్నారి పుట్టినరోజు వేడుకలు జరుగుతున్న వాతావరణం కనిపించింది. శచీదేవి అక్కడకు రాగానే ఆ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపారు. కానీ, దగ్గరికి వెళ్లిన తర్వాతగానీ ఆమెకు అసలు విషయం అర్థంకాలేదు. అక్కడ ఏర్పాటు చేసింది చిన్నారి పుట్టినరోజు వేడుక కాదని.. తనమీద ఉన్న అభిమానంతో అక్కడి చిన్నారులు ఏర్పాటు చేసిన వేడుక అని ఆమె తెలుసుకుని ఆశ్చర్యపోయారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారందరికీ స్వయంగా తినిపించారు. తన పట్ల వారికున్న అభిమానానికి మురిసిపోయారు. చిన్నారులంతా ఉన్నతంగా ఎదగాలని దీవించారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాం



గాంధీరోడ్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి



గాంధీరోడ్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే బాలినేని సోదరి రమణమ్మ

- ఒంగోలు 25, 26 డివిజన్లలో బాలినేని సతీమణి శచీదేవి, సోదరి రమణమ్మ ఎన్నికల ప్రచారం

ఒంగోలు: ఒంగోలును గొప్పగా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి మరో అవకాశం ఇచ్చి సిక్సర్ విజయానికి సహకరించాలని ఆయన సతీమణి బాలినేని శచీదేవి, సోదరి సుంకర రమణమ్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని 25, 26 డివిజన్ల పరిధిలోని బాలాజీరావుపేట, కామాక్షమ్మగుడి, గంటాపాలెం, గాంధీరోడ్డు, కోర్టు సెంటర్, పప్పుల బజారులో శనివారం మహిళలతో మమేకం–స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శచీదేవి మాట్లాడుతూ 25వ డివిజన్‌లో సుమారు రూ.1.53 కోట్లతో అభివృద్ధి పనులు జరగ్గా, సుమారు రూ.14.26 కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ స్కూల్లో నాడు–నేడు పథకం కింద రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులు, బాలాజీరావుపేటలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్డు, రూ.13.6 లక్షలతో పైపులైను నిర్మాణం, రూ.5 లక్షలతో మురుగుకాలువ నిర్మాణ పనులు చేశామని వివరించారు. ఇవికాకుండా 25వ డివిజన్‌లో 373 మందికి రిజిస్ట్రేషన్ చేసిన ఇంటిపట్టాలు ఇచ్చామన్నారు. మరో 100 ఇళ్లపట్టాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగాయని, ఎన్నికల తర్వాత ఇస్తామని తెలిపారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జరిగిందని గుర్తు చేశారు. పింఛన్‌దారులకు ఇంటికే నగదు అందిందన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా గ్రామస్థాయికే పరిపాలన అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఉదయం రంగారాయుడు చెరువు సమీపంలోని కామాక్షమ్మ గుడిలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. సాయంత్రం సెంట్రల్ కేఫ్ నుంచి ప్రారంభమైన ప్రచారం.. గాంధీరోడ్డులో సాగింది. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి), గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దాసరి నారాయణరావు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పట్నం మధుసూదన్, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, కన్వీనర్లు తుల్లి, శివ, అజయ్, ఎస్.సుభాషిణి, ఏ తిరుపతి, చలం, తిపురం మల్లి, పార్టీ ఐటీ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సునీల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం.హరీష్‌రెడ్డి, రాష్ట్ర కో ఆర్డినేటర్ శింగారెడ్డి రోశిరెడ్డి, 26వ డివిజన్ అధ్యక్షుడు జాజుల కృష్ణ, బాపూజీ కాంప్లెక్స్ అధ్యక్షుడు కోడూరి సత్యన్నారాయణ, నిడమానూరి మురళీకృష్ణ, 25వ డివిజన్ కో ఆర్డినేటర్ డి.చంద్రారెడ్డి, ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ తాతా బదరీనాథ్, వేమూరి శ్రీను, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కోడూరి కిషోర్, ఆరామక్షేత్రం చైర్మన్ మునగా కృష్ణారావు, డివిజన్ ఇన్‌చార్జి కటారి ప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కో ఆర్డినేటర్ ఎం.మనోజ్‌కుమార్, కృష్ణవేణి, రమణమ్మ, ఆర్యవైశ్య సంఘం మాజీ సెక్రటరీ గుర్రం బదరీనాథ్, వాసవీక్లబ్ మాజీ అధ్యక్షుడు తమ్మన ఆంజనేయులు, అమరా శ్రీను, కారంశెట్టి కిరణ్, మాజీ కౌన్సిలర్, పెయింట్స్ అసోసియేషన్ టౌన్ అధ్యక్షుడు దాసరి బ్రహ్మానందం, బియ్యపు విజయకుమార్, పచ్చిపులుసు శ్రీనివాసులు, పాల్గొన్నారు.

పేదల తలరాతలు మార్చే మేనిఫెస్టో

- వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై ఆ పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి



రాజుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

రాజుపాలెం (కొత్తపట్నం): పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల తలరాతలు మార్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టో ఉందని ఆ పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాజుపాలెం గ్రామంలో ఇంటింటికి తిరిగి పథకాల గురించి ప్రజలకు ఆయన వివరించారు. వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే మళ్లీ ఐదేళ్ల పాటు అన్ని పథకాలు మీ ఇంటి వద్దకు వస్తాయని తెలిపారు. అందరికీ అనుకూలంగా ఉండే మేనిఫెస్టోను సీఎం జగన్ విడుదల చేశారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే కచ్చితంగా అమలు చేస్తారని అన్నారు. రాజుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో రూ.24.75 కోట్ల సంక్షేమ పథకాల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో గడిచిన ఐదేళ్లలో జమ చేశారని తెలిపారు. మళ్లీ యథావిధిగా సంక్షేమ పథకాలు అందాలంటే తన తండ్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఉప్పుటూరి కోటేశ్వరరావు, సర్పంచ్ భర్త కొండూరి గోవింద్, జిల్లా అగ్రకల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్ రెడ్డి, మార్పూరి చక్రారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఊడా సుబ్రహ్మణ్యం, జిలాని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు 48వ డివిజన్‌లో...



ఒంగోలు 9వ డివిజన్‌లో...

చీమకుర్తి మండలంలో...





ఫ్యాన్స్ ప్రచారం...

వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ప్రజలంతా ఓటేయాలని కోరుతూ శనివారం పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యేగా బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, సంతనూతలపాడు ఎమ్మెల్యేగా మేరుగు నాగార్జునని, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. – సాక్షి, ఒంగోలు